ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు కలిసి ఆటస్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి కాలనీ, ప్రతి గ్రామంలో పిల్లలకు అందుబాటులో ఉండే మైదానాలను అభివృద్ధి చేయాలి. పాఠశాలల్లో క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను బయట ఆటలకు ప్రోత్సహించాలి. కేవలం మార్కులే కాకుండా ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యమని గుర్తించాలి. ఆటస్థలాలు కేవలం ఖాళీ ప్రదేశాలు కావు. అవి పిల్లల కలలకు, స్నేహాలకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు పునాదులు. ఒక తరం ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదగాలంటే వారికి ఆడుకునే స్వేచ్ఛ, తగిన ప్రదేశాలు తప్పనిసరిగా ఉండాలి. అభివృద్ధి పేరుతో ఆటస్థలాలు కనుమరుగైతే, భవిష్యత్తులో మనం కోల్పోయేది కేవలం మైదానాలు మాత్రమే కాదు, ఆరోగ్యవంతమైన బాల్యాన్ని కూడా. అందుకే ఆటస్థలాల సంరక్షణను సమాజం అత్యవసర బాధ్యతగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

# ఆటా మహాసభలకు కేటీఆర్‌కు ఆహ్వానం

- అమెరికాలో తెలుగు మహాసభలు.
- ఆటా ప్రతినిధులతో భేటీ.
- హాజరుపై సానుకూల స్పందన.

**జనం వాయిస్, హైదరాబాద్, మే 30:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ను అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. వచ్చే ఏడాది అమెరికాలో నిర్వహించనున్న ఆటా తెలుగు మహాసభలకు హాజరుకావాల్సిందిగా ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానించింది. అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రంలో 2026 జూలై 31, ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ తెలుగు మహాసభల వివరాలను ఆటా ప్రతినిధులు కేటీఆర్‌కు వివరించారు. మహాసభల ద్వారా తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అమెరికన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్ చల్లా, కాన్ఫరెన్స్ నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల మహాసభల నిర్వహణకు సంబంధించిన ప్రణాళికలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భేటీలో అమెరికాలో నివసిస్తున్న భారతీయుల పరిస్థితులు, ప్రవాస భారతీయుల పాత్ర, ప్రస్తుత రాజకీయ పరిణామాలు వంటి



అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. తెలుగు సమాజం అభివృద్ధికి ప్రవాస భారతీయులు చేస్తున్న సేవలను ప్రతినిధులు ప్రస్తావించారు. కార్యక్రమంలో ఆటా కాన్ఫరెన్స్ కోఆర్డినేటర్ తిరుమల రెడ్డి, ఈశ్వర్ రెడ్డి బండా తదితరులు పాల్గొన్నారు. తెలుగు సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు ఆటా చేపడుతున్న కార్యక్రమాలను కేటీఆర్ అభినందించినట్లు తెలిసింది. మహాసభలకు హాజరుకావాలన్న ఆహ్వానంపై కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ఆటా ప్రతినిధులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను కలిపే వేదికగా ఆటా మహాసభలు కొనసాగుతున్నాయని, ఈసారి కూడా భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఏసీబీ వలలో సైబర్ అధికారి

- తొమ్మిది లక్షలు డిమాండ్ ఆరోపణ.
- ఐదు లక్షలు తీసుకుంటూ పట్టివేత.



**జనం వాయిస్, హైదరాబాద్, మే 30:**
తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్‌పై లంచం ఆరోపణలు సంచలనం సృష్టించాయి. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ బత్తుల మహేందర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఓ ఫిర్యాదుదారుడి నుంచి కేసుకు సంబంధించిన అంశంలో సహకారం అందించేందుకు ఇన్‌స్పెక్టర్ మహేందర్ రూ.9 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మొదటి విడతగా రూ.5 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి ఆయనను పట్టుకున్నట్లు తెలిసింది. ఫిర్యాదుదారుడి సమాచారంతో ముందస్తు ప్రణాళిక ప్రకారం ఏసీబీ అధికారులు ఉచ్చుపన్ని చర్యలు చేపట్టారు. లంచం నగదు స్వీకరిస్తున్న సమయంలో అధికారులు రంగంలోకి దిగి సాక్ష్యాధారాలతో పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో కలకలం రేగింది. ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు హెచ్చరించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించనున్నట్లు సమాచారం. నిందితుడిపై అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. నగదు స్వాధీనం, ఇతర ఆధారాల సేకరణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేసిన సందర్భాల్లో వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచించారు. అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

# ఉద్యమకారుల గౌరవానికి ప్రత్యేక కమిటీ



- సచివాలయంలో తొలి సమావేశం.
- అఖిలపక్ష సమావేశానికి నిర్ణయం.
- అర్హుల గుర్తింపుపై కార్యాచరణ.

జనం వాయిస్, హైదరాబాద్, మే 30:
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో తొలి సమావేశం నిర్వహించింది. కమిటీ చైర్మన్ కే. కేశవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొని విధివిధానాలు, సమాచార సేకరణ, అర్హుల గుర్తింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఏర్పాటు చేసిన ఈ కమిటీ తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించడమే లక్ష్యంగా పనిచేయనుంది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలను అధికారికంగా గుర్తించి చరిత్రలో నిలిపేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యమంలో వివిధ దశల్లో పాల్గొన్న వ్యక్తుల వివరాలను సేకరించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఉద్యమంలో జైలు శిక్షలు అనుభవించిన వారు, పోలీసు కేసులు ఎదుర్కొన్న వారు, మేధావులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, సింగరేణి కార్మికులు సహా ఉద్యమానికి తోడ్పడిన ప్రతి ఒక్కరిని గుర్తించేలా ప్రమాణాలు రూపొందించాలని సమావేశంలో చర్చించారు. అమరవీరుల కుటుంబాలకు కూడా సముచిత గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 4న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. వివిధ వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి పారదర్శక విధానంలో అర్హుల జాబితా రూపొందించనున్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలని కమిటీ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరఫున తగిన గౌరవం, గుర్తింపు కల్పించేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి చరిత్రలో నిలిపే బాధ్యతను నెరవేర్చుతుందని నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొని సమాచార సేకరణ ప్రక్రియపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# మంథని అభివృద్ధి ప్రధాత మంత్రి శ్రీధర్ బాబు.

## ఏఎంసి వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య.

- అడవిశ్రీరాంపూర్ లో ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు.
- ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన రాజయ్య దంపతులు.



**జనం వాయిస్, ముత్తారం, మే 30:**
మంథని అభివృద్ధి ప్రదాత తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని కమాన్పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, ముత్తారం సింగిల్ విండో డైరెక్టర్ మద్దెల వెంకటలక్ష్మిలు అన్నారు. శనివారం మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఉపాధి కూలీల మధ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధి కూలీల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం, ముత్తారం మండలం మాజీ జడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు లు హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మంథని నియోజకవర్గం తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపే లక్ష్యంగా మంత్రి పని చేస్తున్నారని అన్నారు. మంథని నియోజకవర్గం లో ప్రతి పల్లె అభివృద్ధిలో దూసుకెళుతుందని అభివృద్ధి అంటే మంత్రి శ్రీధర్ బాబు తో నని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొట్టె అన్నపూర్ణ ఉపేందర్, పారుపల్లి సర్పంచ్ చొప్పరి సంపత్, లతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్కం ప్రభాకర్, గాదం శ్రీనివాస్, కోల విజయ్, దాసరి చంద్రమౌళి గౌడ్, నూనెటి కృష్ణ, మూగ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు వాతావరణ సలహా సేవలు

- తుమ్మల చేతుల మీదుగా ప్రారంభం.
- వాట్సాప్ ద్వారా రైతులకు సమాచారం.
- కృత్రిమ మేధస్సుతో వ్యవసాయ సూచనలు.



**జనం వాయిస్, హైదరాబాద్, మే 30:**
రాష్ట్ర రైతులకు సమయానుకూల వాతావరణ సమాచారం, శాస్త్రీయ వ్యవసాయ సూచనలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం"ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సచివాలయంలో అధికారికంగా ప్రారంభించారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సమాచారాన్ని చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియా, ఎవిడెన్స్ యాక్షన్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సంబంధిత సంస్థలతో అవగాహన ఒప్పందం కుదిరింది. కృత్రిమ మేధస్సు ఆధారంగా రైతులకు అవసరమైన వాతావరణ సమాచారం, వ్యవసాయ సూచనలను అందించే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో వర్చువల్ విధానంలో పాల్గొన్న ఎవిడెన్స్ యాక్షన్ కంట్రీ డైరెక్టర్ అంకుర్ గర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సేవలను మరింత విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి పెద్ద సవాలుగా మారుతున్న నేపథ్యంలో ఖచ్చితమైన వాతావరణ సమాచారం రైతులకు చేరడం అత్యవసరమని అన్నారు. మండలాల వారీగా వర్షపాతం, ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితులు, పంటల సాగుకు సంబంధించిన సూచనలను వాట్సాప్ ద్వారా రైతులకు పంపించనున్నట్లు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత వాతావరణ అంచనాల ద్వారా రైతులు సరైన సమయంలో సాగు నిర్ణయాలు తీసుకునే అవకాశం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. దీంతో పంట నష్టాలను తగ్గించడంతో పాటు దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. రైతులు తమ సందేహాలను స్వర రూపంలో అడిగి సమాధానాలు పొందే విధంగా ఈ సేవలను మరింత అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని 17 జిల్లాల పరిధిలోని 304 మండలాలకు చెందిన సుమారు 15 లక్షల మంది రైతులకు ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు వెల్లడించారు. తెలంగాణ రైజింగ్2047 లక్ష్యాల సాధనలో భాగంగా వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.

# తల్లి కుతుర్లు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

**ఇబ్రహీంపట్నం, మే 30,(జనం వాయిస్):**
హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో 2ఫిబ్రవరి 2026న 777 మంది తో కార్యక్రమం నిర్వహించారు. అందులో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని మెట్లిల్ల గ్రామానికి చెందిన అంగన్వాడి టిచర్ గా పని చేస్తున్న గుంటి అరుణ మరియ ఎస్వి స్ టీటీఆర్ స్కూల్ లో చదువుతున్న అభిజ్ఞ రోజ్ (10) గుంటి శ్రీ విజ్ఞ(8) శుక్రవారం గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికేట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిద దేశాల నుంచి 2 వేల మంది కీబోర్డ్ వాయిద్యకారులు గంటపాటు కి బోర్డ్ వాయించారు. వారికి వ్యవస్థాపకుడు అగస్టిన్ దండింగి గర్టిఫికెట్లు అందజేశారు. ఈ విజయంతో వారు తమ కుటుంబానికి, పాఠశాలకు మరియు




ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షించారు.



RNI NO:TGTEL/26/A0383
దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM

# రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి శైలజ దుర్మరణం



**జనం వాయిస్, మంచిర్యాల, మే 30:**
మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం గుల్లకోట వద్ద జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఎంపీడీవో కార్యాలయ ఈసీ శైలజ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం రాత్రి లక్సెట్టిపేటలో నిర్వహించిన ఎంపీడీవో రిటైర్మెంట్ వేడుకలకు ఆమె తన భర్తతో కలిసి హాజరై, వేడుక ముగిసిన అనంతరం తిరిగి బైక్‌పై మంచిర్యాలకు బయలుదేరారు. మార్గమధ్యంలో గుల్లకోట వద్దకు రాగానే ఒక్కసారిగా ఒక పంది బైక్‌కు అడ్డం రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాద తీవ్రతకు శైలజ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన ఆమె భర్తను స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

# మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



**జనం వాయిస్, మంచిర్యాల, మే 30:**
మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు నివాసం ఎల్ఐసీ కాలనీ వద్ద బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి పడాల రవీందర్ ఆధ్వర్యంలో పలు విద్యార్థి సంఘాల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు వీరికి మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఎండీ రెహమాన్, కరుణాకర్, అక్షయ్ చిన్ను, అభిషేక్, సాయి శ్రవణ్, అక్షయ్, ప్రశాంత్, ధనుష్, రోహిత్, అక్షయ్, జోసెఫ్, అంజి ఉన్నారు. ఈ కార్యక్రమంలో తోట తిరుపతి, పడాల శ్రీనివాస్, బల్లికొండ రమేష్, చోటు, నక్క తిరుపతి, జక్కం జగన్, జావిద్, వేణు గోపాల్, సూర్ల రాము, రామగిరి శ్రీకాంత్, ఎండీ షకీల్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో టాస్క్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు

**నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు: అధికారుల హెచ్చరిక.**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 30:**
రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించే లక్ష్యంతో హాజీపూర్ మండలంలోని ఎరువుల దుకాణాల్లో మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఈ తనిఖీల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యతతో పాటు స్టాక్, బిల్లులు, లాట్ నంబర్లు, ధరల పట్టికలు, లైసెన్స్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఏడీఏ కృష్ణ, హాజీపూర్ తహసీల్దార్ పుష్పలత, ఏఓ కృష్ణ, పోలీసు అధికారి తిరుపతి తదితరులు PACS పద్దనపల్లి, కొమురెల్లి మల్లికార్జున ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని, నాణ్యత లేని, గడువు ముగిసిన, నకిలీ విత్తనాలు లేదా ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా వ్యాపారులను హెచ్చరించారు. ప్రభుత్వం సిఫార్సు చేసిన వరి సన్న రకాలైన BPT 5294, తెలంగాణ సోనా RNR 15048, KNM 1638, Jai Shree Ram, HMT, WGL 962, WGL 44, JGL 1798 వంటి విత్తనాలను మాత్రమే విక్రయించాలని, దొడ్డు రకాల విత్తనాలను అమ్మరాదని అధికారులు స్పష్టం చేశారు.



# సిపిఎం పార్టీకి గిరిజన నాయకుడు కేలోత్ బాల రాజీనామా.

**జనం వాయిస్ -గార్ల -మే 30:-**
మండల పరిధి,పినిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు కేలోత్ బాల శనివారం సిపిఎం పార్టీకి రాజీనామా చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముప్పై ఐదు ఏళ్లుగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసినట్లు తెలిపారు.గత కొంతకాలంగా స్థానిక నాయకుల ప్రవర్తన, వారి ధోరణి అసంతృప్తికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక నాయకత్వ పోకడలు నచ్చకే తీవ్ర మనస్తాపంతో పార్టీ వీడాల్సి వస్తోందని తెలిపారు.పార్టీలో పాత తరం కార్యకర్తలకు, ప్రజా క్షేత్రంలో నిలబడే వారికి గుర్తింపు కరువైందని,అందుకే సిపిఎం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.



# పల్లెల్లో ఉద్యోగం–పట్టణాల్లో నివాసం

**పని చేసేచోట నివాసముండని ఉద్యోగులు.**
**ఆలస్యంగా రావడం -తొందరగా వెళ్లడం.**
**ఇబ్బందులు పడుతున్న ప్రజలు.**





**జనం వాయిస్- గార్ల-మే 30:-**
ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజలకు వారధులు.ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు చేరవేయడంలో వారిదే కీలకపాత్ర.కానీ వారే నిబంధనలకు పాతరేస్తున్నారు.మండలంలో కొందరు ఉద్యోగం ఒకచోట చేస్తారు.నివాసం మరోచోట ఉంటుంన్నారు.ఇంకేముంది సమయానికి రారు.పని చేయరనే ఆరోపణలు వస్తున్నాయి.ఇదీ మన ప్రభుత్వ ఉద్యోగుల కొందరి పనితీరు.ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు వెచ్చించి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులదే కీలకపాత్ర.ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించేది వారే. అందుకే ప్రభుత్వం పని చేసేచోట నివాసముండాలని నిబంధన విధించింది.మండల వ్యాప్తంగా సగానికిపైగా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు.దీంతో అవసరమైన సమయాల్లో ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పని నిమిత్తం దూరప్రాంతాల నుంచి ఉదయాన్నే కార్యాలయాలకు వచ్చే ప్రజలు అధికారి ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూడాల్సి వస్తోంది.

**ఆలస్యంగా రావడం- తొందరగా వెళ్లడం...**
పట్టణ ప్రాంతాల్లో నివాసముంటున్న అధికారులు వారు పనిచేసే ప్రాంతాలు దూరంగా ఉండడంతో కార్యాలయాలకు సమయానికి రాలేకపోతున్నారు.మండలం లోని రెవెన్యూ, మండల ప్రజా పరిషత్, వైద్య, విద్యా, వ్యవసాయం ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు.కొంతమంది ఉద్యోగులు రవాణా సౌకర్యం సక్రమంగా లేదన్న సాకుతో వెళ్లాల్సిన సమయానికంటే ముందుగానే వెళ్తున్నారు. దీంతో పని నిమిత్తం ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సివస్తుంది.సమయానికి కార్యాలయాలకు ఉద్యోగులు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

**ఏజెన్సీ అలవెన్సులు,ఇంటి అద్దెలు స్వాహా...**
ప్రభుత్వ ఉద్యోగులకు వారి హోదాలకు అనుగుణంగా ప్రభుత్వం వేలాది రూపాయలు ఇంటి అద్దె రూపంలో చెల్లిస్తుంది. కొందరు ఉద్యోగులు స్థానికంగా ఉంటున్నట్లు రుజువులు చూపిస్తున్నా వాస్తవానికి చాలా మంది అధికారులు పట్టణాల్లో నివాసముంటున్నారు. దీంతో ప్రజాధనం అధిక మొత్తంలో దుర్వినియోగం అవుతోంది. ఇలా అధికారులు స్థానికంగా ఉండక పోవడంతో పనుల్లో జాప్యం నెలకొంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొ రవచూపి మండలంలోని ఉద్యోగులు పని చేసే చోటే నివాసం ఉండేలా,నిర్ణీత సమయాల్లో విధులకు సక్రమంగా హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

**పటాన్ చేరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి.**
**భానూరులో ప్రారంభమైన పి పి ఆర్ వాలీబాల్ టోర్నమెంట్.**



**జనం వాయిస్, పఠాన్ చేరు, మే,30:**
నేటి తరం యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. పటాన్ చేరు మండలం భానురు గ్రామంలో ఏర్పాటు చేసిన పి పి ఆర్ వాలీబాల్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే జిఎంఆర్ లాంచనగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని తెలిపారు. నేటి ఆధునిక జీవనశైలిలో యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తి యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా క్రీడ మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి తన రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కృష్ణ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడాకారులు, క్రీడా పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఈ సెట్ రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థికి సన్మానం.

**వరుణ్ సందేశ్ ను ఘనంగా సన్మానించిన సర్పంచ్ పార్వతి హతీరామ్ నాయక్.**



**జనం వాయిస్ -గార్ల -మే 30:**
గార్ల మండలానికి చెందిన గ్రామీణ వైద్యుడు కోట శ్రీనివాస్ కుమారుడు వరుణ్ సందేశ్ రాష్ట్రస్థాయిలో ఈ సెట్ ర్యాంక్ సాధించారు. ఈసందర్భంగా గార్ల మేజర్ సర్పంచ్ బానోతు పార్వతి హతీరామ్ నాయక్,యువతీ, యువకులు, పుర ప్రముఖులు, గ్రామ పెద్దలు, అధికారులతో కలిసి మేజర్ గ్రామపంచాయతీ పంచాయతీ కార్యాలయంలో వరుణ్ సందేశ్ ను శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, వరుణ్ సందేశ్ పేద కుటుంబంలో జన్మించి చదువుపై ఆసక్తి, పట్టుదల కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించడం మండలానికి గర్వకారణం అన్నారు.భవిష్యత్ లో చదువులో ఉన్నత స్థాయిని ర్యాంక్ సాధించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.చదువుతో పాటు సమాజానికి కూడా సేవ చేస్తూ ప్రజలను చైతన్య పరచాలన్నారు.ఈకార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు తోడేటి శ్రీనివాస్,హతిరామ్ నాయక్,సోను జైన్, పరుచూరి చిన్ని, ఉపేందర్ రెడ్డి,చారి, కంచర్ల సుధాకర్,కృష్ణ, పిడమర్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాల దహనంపై వ్యవసాయ శాఖ నిర్లక్ష్యం..!

- అవగాహన లోపంతో రైతులు నష్టాల బాట.
- కొప్పుల, పెద్దకోడెపాకలో అగ్నిప్రమాద ఘటన తర్వాతైనా అధికారులు మేల్కొంటారా..?.



**జనం వాయిస్,శాయంపేట,మే 30:**
శాయంపేట మండలంలో రైతులు పంట కోత అనంతరం పొలాల్లో మిగిలిన పంట వ్యర్థాలకు నిప్పంటించి కాల్చివేస్తున్న ఘటనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పంట వ్యర్థాల దహనాన్ని నిషేధించినప్పటికీ, రైతులకు సరైన అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూమిలోని సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు, పోషకాలు నాశనమవడంతో నేల సారం తగ్గి భవిష్యత్తులో పంట దిగుబడులు పడిపోతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పంట వ్యర్థాల దహనం వల్ల మంటలు ఇతర పొలాలకు వ్యాపించి భారీ పంట నష్టాలు సంభవించే ప్రమాదం ఉంది. ఇటీవల మండలంలోని కొప్పుల,పెద్దకోడెపాక లో అగ్ని ప్రమాదం గ్రామంలో పంట వ్యర్థాల మంటల్లో చిక్కుకుని ఒక వ్యక్తి మృతి, పాఠశాల గది,వాహనాల దగ్ధం ఘటన జరిగినప్పటికీ, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం పట్ల రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పంట వ్యర్థాల దహనం వల్ల వెలువడే పొగ వాతావరణ కాలుష్యాన్ని పెంచడంతో పాటు ప్రజల్లో శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతోంది. పరిస్థితి మరింత విషమించకముందే వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పంట వ్యర్థాల నిర్వహణకు ప్రత్యామ్నాయ పద్ధతులను రైతులకు పరిచయం చేయాలని పలువురు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# పోషణ మాసం కార్యక్రమం నిర్వహణ.

- అంగన్వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.
- చిన్నారులకు సర్టిఫికెట్లు, యూనిఫాంల పంపిణీ.

**జనం వాయిస్,శాయంపేట, మే 30 :**
శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామ అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం సూపర్వైజర్ పుట్ట పుణ్యవతి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పోషకాహారం, విద్య, ఆటపాటలు అందిస్తున్నామని, జూన్ 2 నుంచి “అమ్మ ముద్ద“ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ కూకిడి శివాజీ, ఉపసర్పంచ్ కొత్తగట్టు సాయికృష్ణ చేతుల మీదుగా ఐదేళ్లు నిండిన చిన్నారులకు ధృవీకరణ పత్రాలు, యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి సెర్ప్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ కృషి


**దివ్యాంగులు తమ నైపుణ్యాని అభివృద్ధి చేసుకొని స్వంత వ్యాపారాలుగ ఎదగాలి.**
**డి ఆర్ డి ఏ, ఏ పీ ఎమ్, ఆధ్వర్యంలో గ్రాంట్లు మంజూరు పత్రాలు అందజేత.**



**జనం వాయిస్, సంగారెడ్డి, మే 30:**
దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ స్వయం ఉపాధి రంగంలో రాణించాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సెర్ప్ సంస్థ యొక్క సహకారంతో నిరంతరం కృషి చేస్తోందని ఫౌండేషన్ మేనేజర్ ఆనంద్ నాయక్ తెలిపారు. కొండాపూర్ మండలము లోని దివ్యాంగులకు స్వయం ఉపాధి అవకాశాలు, వ్యాపార నిర్వహణ, ఆర్థిక ప్రణాళిక, మార్కెటింగ్ పద్ధతులు అదేవిధంగా చిన్న వ్యాపారాల అభివృద్ధిపై డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మరియు సెర్ప్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ ద్వారా దివ్యాంగులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని స్వంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా సాధించగలరని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ ఆనంద్ నాయక్ మాట్లాడుతూ, దివ్యాంగులను సమాజంలో ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడం కోసం ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దివ్యాంగులు కూడా ఇతరుల మాదిరిగానే ప్రతిభ కలిగిన వారేనని, సరైన అవకాశాలు మరియు మార్గదర్శకత్వం కల్పిస్తే,అందరూ విజయవంతమైన వ్యాపారవేత్తలుగా ఎదగగలరని పేర్కొన్నారు. అనంతరం, డి ఆర్ డి ఏ నుండి ఏ పి యమ్, మాణిక్యం తో కలిసి దివ్యాంగులకు గ్రాంట్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ గ్రాంట్లు, స్వయం ఉపాధి వ్యాపారాల ప్రారంభానికి ఎంతో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సంగారెడ్డి జిల్లా క్లస్టర్ మేనేజర్ యన్. రవిప్రకాష్ , క్లస్టర్ కోఆర్డినేటర్ జె. శ్రీకాంత్ , మండల సమాఖ్య క్లస్టర్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**
**వాస్తవ సమాచారాన్నే ఎన్యూమరేటర్లకు అందించాలి.**
**సర్వేలో ఇచ్చే సమాచారంతో సంక్షేమ పథకాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.**
**క్యాంపు కార్యాలయంలో హౌస్ లిస్టింగ్ సర్వేలో పాల్గొన్న జిల్లా కలెక్టర్.**



**జనం వాయిస్, పెద్దపల్లి, మే-30:**
జనాభా గణన-2027లో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ సర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించి ఎన్యూమరేటర్లకు వాస్తవ సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హౌస్ లిస్టింగ్ సర్వేలో పాల్గొని ఎన్యూమరేటర్‌కు అవసరమైన వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్వే ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ సర్వే జనాభా గణన-2027లో అత్యంత కీలకమైన దశ అని తెలిపారు. ప్రతి ఇంటి నిర్మాణం, గృహ సౌకర్యాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య సదుపాయాలు, విద్యుత్, వంట ఇంధనం, కమ్యూనికేషన్ సౌకర్యాలు తదితర వివరాలను ఈ సర్వే ద్వారా నమోదు చేస్తారని చెప్పారు. సర్వే ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సహకరించి సరైన వివరాలను అందించాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఈ సమాచారంతో ఏ సంక్షేమ పథకం రద్దు కావడం గానీ, లబ్ధిదారుల అర్హతలు ప్రభావితమవడం గానీ జరగదని స్పష్టం చేశారు. ప్రజలు ఎటువంటి అపోహలకు తావివ్వకుండా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు, పర్యవేక్షకులు నిబంధనల ప్రకారం ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను నమోదు చేయాలని, సర్వేను పారదర్శకంగా, నాణ్యతతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
**జూన్ 10న లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక.**
**1వ, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.**




**జనం వాయిస్, పెద్దపల్లి, మే 30:**
2026-27 విద్యా సంవత్సరానికి గాను పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పాఠశాలల్లో 1వ తరగతి, 5వ తరగతుల్లో ప్రవేశం కొరకు జిల్లాకు చెందిన అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నందు 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్) లో 70 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్) లో 73 సీట్లు కేటాయించడం జరిగిందని ఆయన వివరించారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000/- లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000/- లోపు ఉండాలని, 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్ ప్రవేశం కోరే విద్యార్థులు 01.06.2020 నుండి 31.05.2021 మధ్య జన్మించి ఉండాలి, ఒక కుటుంబం నుండి ఒకరికి మాత్రమే ప్రవేశానికి అర్హత ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు ఫారాలను మే 16 నుండి జూన్ 05 వరకు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుండి పొందవచ్చును. పూర్తి చేసిన దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలతో (కులం, ఆదాయం, పుట్టిన తేదీ, ఆధార్ కార్డు మొదలైనవి) జతపరిచి జూన్ 06వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు అదే కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల నుండి జూన్ 10న లాటరీ పద్ధతి ద్వారా సీట్ల కేటాయింపు నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, ఇతర వివరాల కొరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో లేదా ఫోన్ నెంబర్లు 9014327045, 9989354155 నందు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గిరిజన యువతీ యువకులకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**




**జనం వాయిస్, పెద్దపల్లి, మే 30:**
తెలంగాణ ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పెద్దపల్లి జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా యువతకు ఉపాధి మార్గాలను సుగమం చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కింద ప్రధానంగా ఐటీఈఎస్, లాజిస్టిక్స్, టెలికాం, వ్యవసాయం గృహోపకరణ, దుస్తుల తయారీ, అందం, సంరక్షణ, టూరిజం, హాస్పిటాలిటీ, ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, హెల్త్ కేర్ ,వంటి రంగాలలో నైపుణ్యాలను అందించడం జరుగుతుంది. శిక్షణ అనంతరం అర్హులైన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, పెద్దపల్లి జిల్లాకు చెందిన ఆసక్తి గల నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు కోసం కరీంనగర్‌లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చు అని పూర్తి వివరాల కోసం 9441174822 నంబరు నందు సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నాటు సారా స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు.

**యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలి.**
**యువతకు సీఐ ఎల్ పవన్ కుమార్ ప్రత్యేక సూచనలు.**

**మరిపెడ, మే 30 జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్,ఐపీఎస్ ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున 5 నుంచి 7 గంటల వరకు మరిపెడ మండలం కోటియా తండా పంచాయతీ పరిధిలోని చౌల్ల తండా,జాల్ తండా,అర్లగడ్డ తండాల్లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు.అక్రమ సారా తయారీపై చేపట్టిన తనిఖీల్లో 50 లీటర్ల నాటు సారా,4 క్వింటాళ్ల బెల్లం,50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు.సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు.సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.ఈ సందర్భంగా మరిపెడ సీఐ ఎల్.పవన్ కుమార్ యువతను ఉద్దేశించి కీలక సూచనలు చేశారు.ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.యువత చెడు స్నేహాలకు,గంజాయి,నాటుసారా వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.తాత్కాలిక ఆనందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని హెచ్చరించారు.యువతే దేశ భవిష్యత్తు నిర్మాతలు.ఉన్నత చదువులు చదివి,మంచి ఉద్యోగాలు సాధించి కుటుంబానికి,గ్రామానికి,దేశానికి పేరు తేవాలి.మీ ముందు తరాలకు మీరే ఆదర్శంగా నిలవాలని,ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దే భాధ్యత నేటి యువతపై ఉన్నదని,గ్రామాల భవిష్యత్ నిర్మాతలుగా యువత ముందుండాలని సీఐ,ఎస్సై గండ్రాతి సతీష్,చిన్నగూడూరు ఎస్సై కుశ్ కుమార్ సంయుక్తంగా పిలుపునిచ్చారు.చట్ట వ్యతిరేక పనుల జోలికి వెళ్లొద్దని,చెడు వ్యాసనాలకు భానిసలై యువత భవిష్యత్తును అందకారం చేసుకోవద్దన్నారు.అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.ఈ దాడుల్లో మరిపెడ సీఐ,ఎస్సైలతో పాటు 25 మంది సిబ్బంది పాల్గొన్నారు.అక్రమ కార్యకలాపాల నియంత్రణకు ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.



# నిబంధనల ప్రకారమే వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి.

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్.**
**రైతులకు నష్టం వాటిల్లకుండా పారదర్శకంగా కొనుగోళ్లు.**
**కేంద్రాల వద్ద తాగునీరు, నీడ, గోనె సంచులు అందుబాటులో ఉంచాలి.**
**అధికారుల సమన్వయంతో లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి.**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 30:**
రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాలు, గోదాములను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఇందులో భాగంగానే మొదటగా జిల్లా కేంద్రంలోని ఎ సి సి ప్రాంతంలో గల హనుమాన్ రైస్ మిల్లును సందర్శించి, అక్కడ జరుగుతున్న ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను నిశితంగా పరిశీలించి నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని శ్రీ వాసవి, అంబికా సాయి, సప్తగిరి రైస్ మిల్లులతో పాటు సారంగపల్లి, పొన్నారం గ్రామాలలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ సతీష్ కుమార్ తో కలిసి కలెక్టర్ సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, సి ఎం ఆర్ ప్రక్రియలను పరిశీలించారు. ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, ఈ కొనుగోలు ప్రక్రియను ఎలాంటి అవాంతరాలు లేకుండా పారదర్శకంగా, వేగంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని, అలాగే సేకరించిన మొక్కజొన్నలను సైతం గోదాములలో సురక్షితంగా నిలువ చేయాలని స్పష్టం చేశారు. చివరగా నస్పూర్ మండలంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి కలెక్టర్ సందర్శించారు. అక్కడ ధాన్యం భద్రత, నిల్వ ఏర్పాట్లను పరిశీలించి, లోడింగ్ మరియు అన్ లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయడంపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది మరియు మిల్లుల నిర్వాహకులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

**విబిజి రాంజీ పథకాన్ని రద్దుచేసి 2005 ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి.**

**మరిపెడ, మే 30 జనం వాయిస్:**
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని,విబిజి రాంజీ పథకాన్ని రద్దుచేసి 2005 ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను వీరయ్య పరిశీలించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం,టెంటు,ప్రాథమిక చికిత్స కిట్టు,పనిముట్లు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.పనిచేసిన కూలీలకు పేస్లిప్పులు ఇచ్చి,వారం వేతనాలు చెల్లించాలని అన్నారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో కూలీలు కొని తినలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు.పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి పనిలో రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విబిజి రాంజీ పథకాన్ని రద్దుచేసి,2005 ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు.లేని పక్షంలో కూలీలందరినీ ఏకం చేసి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం గ్రామ అధ్యక్షులు తాడూరి వీరేంకులు,అల్వాల పురుషోత్తం,చేనే పోయిన లాలయ్య,ఉపాధి మేట్లు,కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# పంట అవశేషాలు కాల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**ఎస్పీ కి వినతి నల్లు సుధాకర్ రెడ్డి.**

**మరిపెడ (మే 30)జనం వాయిస్:**
ఆత్మ కమిటీ చైర్మన్ నాళ్ళు సుధాకర్ రెడ్డి పంట అవశేషాలను కాల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించారు.మహబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో కలెక్టర్ శబరీష్ ని మరిపెడ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కల్సి పూల మొక్క అందించి,వ్యవసాయ శాఖ అవగాహన కల్పించినప్పటికీ కొంత మంది రైతులు తమ పంట అవశేషాలను కాల్చడం వలన భూమి భూసారం దెబ్బతిని దిగుమతి రాకపోగా,మంటలతో పక్కనే ఉన్న జామాయిల్,ఆయిల్ ఫామ్ మొక్కలు మోటార్లు,పైపులు కాలిపోవడం,భారీ ఎత్తున ఆస్తి నష్టం,ప్రాణ నష్టం సంభవిస్తున్నాయని దీనిపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకునే విధంగా దిశా నిర్దేశం చేయాలని వారిని కోరగా,స్పందించిన ఎస్పీ ఇప్పటికే తమ చర్యలు ప్రారంభమయ్యాయని,ఉదృతంగా చర్యలు తీసుకునే విధంగా తమ శాఖను మరింత అప్రమత్తం చేస్తున్నామని అన్నారు.



డైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# షార్ట్ సర్క్యూట్‌తో ఆయిల్ ఫామ్ తోట దగ్ధం.

**- రూ.20 లక్షలకు పైగా నష్టం జరిగిందని రైతు ఫిర్యాదు.**




**జనం వాయిస్, శాయంపేట, మే 30:**
శాయంపేట మండల శివారులో ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆయిల్ ఫామ్ తోట పూర్తిగా దగ్ధమై రూ.20 లక్షలకు పైగా నష్టం జరిగిందని రైతు పున్నం రాజేందర్ రెడ్డి శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మండల శివారులోని తనకు, తన భార్యకు చెందిన సుమారు 6 ఎకరాల 10 గుంటల భూమిలో సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్ తోటలోకి గురువారం మధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. సమీపంలోని విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు ఎగిసి పొలాల్లో ఉన్న ఎండిన పంట అవశేషాలకు అంటుకుని వ్యాపించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఏడాది క్రితం నాటిన ఆయిల్ ఫామ్ మొక్కలు, డ్రిప్ పైపులు, బోరు పైపులు పూర్తిగా కాలిపోయాయని, దీంతో భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందన్నారు. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించలేదని ఆరోపించారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని పేర్కొంటూ సంబంధిత అధికారులపై కేసు నమోదు చేసి నష్టపరిహారం అందించడంతో పాటు రైతులను ఆదుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

# చిన్నారుల భవిష్యత్తుకు 'అంగన్‌వాడీ' బంగారు బాట

- ఘనంగా 'అమ్మ మాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమం.
- మెనూ ప్రకారం పౌష్టికాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి: జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్.

**జనం వాయిస్,మంచిర్యాల, మే 30:**
అంగన్‌వాడీ కేంద్రాల వైపు చిన్నారులు వేసే ప్రతి అడుగు వారి బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది అని మంచిర్యాల జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని రామ్‌నగర్ సెక్టార్‌లో "అమ్మ మాట – అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సి.డి.పి.ఓ విష్ణు ప్రియ, సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ "అమ్మ మాట – అంగన్‌వాడీ బాట" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు రోజువారీ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు, సమయానుసారంగా వారి ఎత్తు, బరువులను నమోదు చేస్తూ శారీరక, మానసిక ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఆయన వివరించారు. 'పోషణ్ అభియాన్' పథకంలో భాగంగా చిన్నారుల ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రౌఫ్ ఖాన్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సరైన పోషణ ద్వారానే పిల్లల భవిష్యత్తు ప్రగతి పథంలో సాగుతుందని, ఇందుకోసం శాఖా పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అర్ధరాత్రి బైక్‌పై గస్తీ నిర్వహించిన జిల్లా ఎస్పీ డా. శబరీష్

**ప్రత్యేక బృందాలతో గంజాయి సేవించే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు.**



**మహబూబాబాద్, మే 30 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక కార్యాచరణలో భాగంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ అర్ధరాత్రి వేళల్లో స్వయంగా బైక్‌పై ప్రత్యేక గస్తీ నిర్వహించారు. పోలీసు ప్రత్యేక బృందాలతో కలిసి గంజాయి సేవించే అవకాశమున్న ప్రాంతాలను తనిఖీ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ మైదానాలు, చెట్ల పొదలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, పార్కులు, విద్యాసంస్థల సమీప ప్రాంతాలు, యువకులు గుమిగూడే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి గంజాయి వినియోగంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ, గంజాయి విక్రయదారులు, సరఫరాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని తెలిపారు. గంజాయి మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని స్థాయిల్లో చర్యలు చేపడుతోందన్నారు. కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, గంజాయికి బానిసైన యువతను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యంగా మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డీ–అడిక్షన్ సెంటర్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక కిట్ల ద్వారా అనుమానిత వ్యక్తులకు యూరిన్ పరీక్షలు నిర్వహించి గంజాయి వినియోగాన్ని నిర్ధారిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 100 మందికి పైగా పరీక్షలు నిర్వహించగా, పాజిటివ్ వచ్చిన వారికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తున్నారు. అవసరమైన వారికి డీ–అడిక్షన్ సెంటర్‌లో ప్రత్యేక వైద్య సేవలు కూడా అందిస్తున్నారు. గంజాయి అలవాటుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులు జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ 8712656999 ను సంప్రదించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని, గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిఎస్పీ తిరుపతి రావు, సీఐ రఘుపతి రెడ్డి, ఎస్.ఐ శివరామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు.

**ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.**
**కందునూరి శ్రీనివాస్, సీఐటీయు జిల్లా అధ్యక్షులు.**

**జనం వాయిస్ -గార్ల-మే 30-:**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, నూతన చట్టాల వల్ల కార్మికుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని సీఐటీయు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర నాయకులు బండ్ల అప్పిరెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్మిక హక్కులను కాలరాసే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొని వస్తున్నారని తెలిపారు. 44 కార్మిక చట్టాలను కేవలం నాలుగు కార్మిక కోడ్ లుగా కుదించి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు కాకుండా సమైక్య పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉన్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పి.దాసు, కిరణ్, శేఖర్, నరేష్,శ్రీనివాస్, రామ్ చరణ్, ప్రేమ్ చంద్,వేణుగోపాల్, రాజశేఖర్,ప్రభాకర్, అరవింద్, కొండమ్మ, సుమతి,రాజేష్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యాన పంటలకు అగ్ని ప్రమాదాల ముప్పు

**నివారణ చర్యలు పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ ద అధికారి మరియన్న సూచన.**



**మహబూబాబాద్, మే 30 (జనం వాయిస్):**
మహబూబాబాద్ జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటలను అగ్ని ప్రమాదాల బారి నుంచి రక్షించుకునేందుకు రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. జిల్లాలో మొత్తం 59,504 ఎకరాల్లో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖకు సంబంధించిన పంటలు సాగులో ఉన్నాయని తెలిపారు. వీటిలో ఆయిల్ పామ్ 8,962 ఎకరాలు, మామిడి 13,542 ఎకరాలు, మిర్చి 30,839 ఎకరాలతో పాటు కూరగాయలు, అరటి, జామ, బొప్పాయి, నిమ్మ, పూలు, మల్బరీ తదితర పంటలు సాగవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఆయిల్ పామ్, మామిడి, సపోటా, నిమ్మ, బొప్పాయి, అరటి తోటలు, నెట్ హౌజ్‌లు అగ్ని ప్రమాదాలకు గురవుతున్నాయని, బిందు సేద్య పరికరాలు కూడా మంటల్లో కాలిపోతున్నాయని తెలిపారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం, తోటల నిర్వహణలో నిర్లక్ష్యం, కలుపు మొక్కలు అధికంగా పెరగడం, తోటల చుట్టూ మంటలు పెట్టడం వంటి కారణాలతో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తోటల చుట్టూ కనీసం ఆరు అడుగుల వెడల్పుతో ఫైర్ లైన్ ఏర్పాటు చేయాలని, ఎండిన ఆకులు, చెత్తను తొలగించాలని సూచించారు. పాదుల్లో తేమ ఉండేలా చూసుకోవడం, మల్చింగ్ చేయడం, బిందు సేద్యం ద్వారా నీరు అందించడం, కలుపు నివారణ చర్యలు చేపట్టడం అవసరమన్నారు. అలాగే పిచ్చి తీగలు, ఎండిన కొమ్మలు, పుల్లలను తొలగించడం, ప్రూనింగ్ చేపట్టడం, అంతర పంటలు సాగు చేయడం, పంట వ్యర్థాలను డీకంపోజర్‌తో కుళ్లబెట్టడం, పశుగ్రాసాలు, కూరగాయ పంటలు పెంచడం వంటి చర్యలు అగ్ని ప్రమాదాలను నివారించడంలో దోహదపడతాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి తమ తోటలను రక్షించుకోవాలని మరియన్న కోరారు.

# హుస్నాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం.

**ఏకగ్రీవంగా 26 అంశాలకు కౌన్సిల్ ఆమోద ముద్ర.**

**జనం వాయిస్ హుస్నాబాద్ మే 30:**
హుస్నాబాద్, మే 30: హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన 26 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో పట్టణంలో ఫిష్ మార్కెట్ నిర్మాణానికి రూ.15 లక్షలు, మంచినీటి సరఫరా బావుల రక్షణ మరియు పరిశుభ్రత కోసం ఇనుప మెష్‌లు, గ్రిల్స్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. అలాగే వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కల కొనుగోలు, నాటడం, నిర్వహణ, లేబర్ల నియామకం తదితర పనుల కోసం గ్రీన్ బడ్జెట్ నుంచి రూ.30.90 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. మల్లెచెట్టు చౌరస్తాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో గేట్లు, గ్రిల్స్ ఏర్పాటు కోసం రూ.2 లక్షలు, ఎల్లమ్మ చెరువులోని మంచినీటి సరఫరా బావికి 15 హెచ్‌పీ మోటార్ కొనుగోలుకు రూ.99 వేల వ్యయానికి కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ , కౌన్సిలర్లు చెన్న బోయిన అనూష , బూరుగు లత, కొండ రజిత కొండ, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, భూక్య సంపత్, కాశబోయిన సరిత, గడిపే సతీష్ కుమార్, సావుల మంజుల, పూదరి వరప్రసాద్, కేశవేని రమేష్, బొల్లి శ్రీనివాస్, ఆకుల రజిత, వైద్యం కిరణ్ ప్రసాద్, గాదె పాక రవీందర్, వాల సుప్రజ, బత్తుల స్వరూప, గోపగోని శోభన్ బాబు, కో–ఆప్షన్ సభ్యులు పున్న లావణ్య, భూక్య సరోజన, మహమ్మద్ హసన్, మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.




# ప్రపంచ దేశాలకు ఆదర్శం మన ప్రజాస్వామ్యం: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మాక్ పార్లమెంట్‌లో ఘనంగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అధికారులు.**



**జనం వాయిస్,మంచిర్యాల, మే 30:**
మంచిర్యాల (నస్పూర్): మన దేశంలో అమలులో ఉన్న ప్రజాస్వామ్యం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మాక్ పార్లమెంట్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ద్వారా లభించిన ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, ఓటర్లంతా దీనిని సక్రమంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజలందరూ తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసమే కాదని, జ్ఞానాన్ని సంపాదించడానికి మరియు హక్కులపై అవగాహన పెంచుకోవడానికి తోడ్పడుతుందని తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యను కూడా నేర్చుకోవాలని సూచించారు. అలాగే మహిళల రక్షణ, పోషణ, సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన గుర్తుచేశారు. భౌగోళికంగా, ఆర్థికంగా మన దేశం ఎంతో పటిష్టంగా ఉందని, దేశ భవిష్యత్తు అంతా యువత చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. వివిధ సంస్కృతులు ఉన్నప్పటికీ అందరం కలిసికట్టుగా జీవిస్తున్నామని, అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాను ముందంజలో ఉంచేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# వరి కొయ్యకాలు కాల్చవద్దు.

**రైతులకు అవగాహన కల్పించిన ఏ ఈ ఓ శ్రీలత.**

**జనం వాయిస్ అక్కన్నపేట, మే.30:**
అక్కన్నపేట మండలం రామవరం క్లస్టర్ పరిధిలోని హాతిరం తండా గ్రామంలో వరి కొయ్యకాలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై వ్యవసాయ విస్తరణ అధికార శ్రీలత రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే కొయ్యకాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, నేలలో ఉండే వానపాములు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు వంటి ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు. దీంతో నేలలో సేంద్రియ పదార్థం తగ్గిపోయి, భూసారం క్షీణించే ప్రమాదం ఉందన్నారు.అదేవిధంగా పంట అవశేషాలను కాల్చడం వల్ల కార్బన్ డైఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు వాతావరణంలోకి విడుదలై పర్యావరణ కాలుష్యానికి దారితీస్తాయని, ప్రజల్లో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. పంట అవశేషాల నిర్వహణలో భాగంగా రైతులు రోటవేటర్ వంటి యంత్రాల సహాయంతో వాటిని భూమిలో కలియదున్నాలని, అవశేషాలు త్వరగా కుళ్లేందుకు వేస్ట్ డికంపోజర్ లేదా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వినియోగించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణ చట్టం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెం.27 ప్రకారం పంట అవశేషాలను బహిరంగంగా కాల్చడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.5 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి–సోమ, ఉప సర్పంచ్ వినోద్, శ్రీరామ్ తండా సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సంపత్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.




# పేదల వైద్య సహాయానికి ప్రభుత్వం అండ



**జనం వాయిస్ అక్కన్నపేట, మే.30:**
అక్కన్నపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 53 మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ (జవీ=ఖీ) చెక్కులను మంజూరు చేసింది. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం అందడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, హుస్నాబాద్ డివిజన్ రైతు ఆత్మ కమిటీ చైర్మన్ జంగపెల్లి ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పేద ప్రజలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా ఉందని పేర్కొన్నారు. అక్కన్నపేట మండలానికి ఒకేసారి 53 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడం ప్రజల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా పోచమ్మతల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు.

- సర్పంచ్ భవిత ఆధ్వర్యంలో హోమం కార్యక్రమాలు.
- పెర్కపల్లే గ్రామ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలంటూ ప్రత్యేక పూజలు.
- భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాదం ఏర్పాటు.





**జనం వాయిస్, హుస్నాబాద్ మే.30:**

సైదాపూర్:మండలంలోని పెర్కపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పోతరాజు భవిత శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుండి అర్చక బృందం సుబ్రహ్మణ్య శర్మ,శంకర శర్మ, శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి వారికి,పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తుల సమక్షంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. గణపతి పూజ, పుణ్య వాచనం,రక్షాబంధనం, అఖండ దీపారాధన, నవగ్రహ, దంపతులచే హోమం కార్యక్రమాలను



నిర్వహించారు. సాయంత్రం గ్రామ మహిళలచే కుంకుమార్చన ,మంగళహారతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని,వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులకు,గ్రామస్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 31న ఆదివారం సాయంత్రం పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ భవిత శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతరాజు భవిత శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొల్ల పరమేశ్వర్,వార్డు సభ్యుడు కాశవేణి రవీందర్, గ్రామస్తులు ముత్యాల మల్లేష్ యాదవ్,పోతరాజు శ్రీనివాస్, బోళ్ల శంకరయ్య,పోతరాజు శ్రీనివాస్,తిప్పని కుమార్, పోతరాజు శ్రీనివాస్,లక్కర్స్ బుచ్చయ్య,పోతరాజు అనిల్, జక్కోజు సుదర్శన్,పోతరాజు మల్లయ్య, పోతరాజు సాయిబాబా,బోల్ల శ్రీధర్, పోతరాజు అనిల్,లక్కర్స్ హరీష్, తిరుమలేష్,పోతరాజు వెంకటేశ్వర్లు,తిప్పని దేవయ్య, పోతరాజు కర్ణాకర్,పోతరాజు కనకయ్య,తిప్పని సురేష్,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతి నిబంధనల ప్రకారమే జరగాలి: జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

## రైస్ మిల్లులు, గోదాముల్లో ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

**జనం వాయిస్, మంచిర్యాల, మే 30:**

జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరించి, కేటాయించిన రైస్ మిల్లులు మరియు గోదాములకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియను నిబంధనల ప్రకారం సజావుగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఆదేశించారు. శనివారం ఆయన జైపూర్ మండలం రసూల్ పల్లిలోని బి.వై.ఎస్. రైస్ మిల్లును మండల తహసిల్దార్ వనజా రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, అక్కడి నుండి మిల్లులకు చేరిన ధాన్యం దిగుమతిని వేగవంతం చేయాలని సూచించారు. ఇందుకోసం తగినంత మంది హమాలీలను అందుబాటులో ఉంచడం జరిగిందని, ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన దిగుమతి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని తన ఛాంబర్ లో జిల్లా పౌర సంబంధాల అధికారి బ్రహ్మ రావు, లక్షెట్టిపేట తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎ.పి.ఎం., ఐ.కె.పి. గుత్తేదారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక హక్కుల పరిరక్షణలో సిఐటియు 55 ఏళ్ల పోరాటం:- నరేష్

## మెడిసిటీ, శ్రీరామ స్పిన్నింగ్ మిల్ యూనియన్లలో జెండా ఆవిష్కరణ





**మేడ్చల్ 30 ( జనం వాయిస్):**

మేడ్చల్ మండలంలో కార్మిక వర్గ ఐక్యత, హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా సీఐటీయూ గత 55 సంవత్సరాలుగా నిరంతర పోరాటాలు కొనసాగిస్తోందని సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ తెలిపారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, శ్రీరామ స్పిన్నింగ్ మిల్ యూనియన్ల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్మిక ఉద్యమాలకు సిఐటియు మార్గదర్శకమని ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, 1970 మే 30న కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ, శ్రమజీవుల సంక్షేమం, దోపిడీకి వ్యతిరేక పోరాటాల లక్ష్యంతో సీఐటీయూ ఏర్పాటైందన్నారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా పారిశ్రామిక, అసంఘటిత, ప్రభుత్వ రంగ కార్మికులను ఐక్యం చేస్తూ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక రక్షణ, కార్మిక చట్టాల అమలుకు అనేక ఉద్యమాలు చేపట్టిందని వివరించారు. ఎనిమిది గంటల పని విధానం కోసం పోరాటం కనీస వేతనాలు, ఎనిమిది గంటల పని విధానం, కార్మిక సంక్షేమ పథకాలు, యూనియన్ హక్కుల పరిరక్షణలో సీఐటీయూ కీలక పాత్ర పోషించిందని నరేష్ పేర్కొన్నారు. దేశంలో కులం, మతం, ప్రాంతం, జాతి పేరుతో ప్రజల మధ్య విభజనలు సృష్టించే శక్తుల పట్ల కార్మిక వర్గం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం మేడ్చల్ మండలంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అధికంగా ఉన్నాయని, ఇక్కడి కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, రవాణా రంగ కార్మికులు, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ ఉద్యోగులు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, డంపింగ్ యార్డ్ కార్మికులు, విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తోందని తెలిపారు. లేబర్ కోడ్లపై విమర్శలు కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నూతన లేబర్ కోడ్లు కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను బలహీనపరిచే విధంగా ఉన్నాయని నరేష్ విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానం, ఉద్యోగ భద్రత, యూనియన్ హక్కులు, సామాజిక భద్రతకు ఈ కోడ్లు ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మెడిసిటీ యూనియన్ జనరల్ కార్యదర్శి కె. శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. సుధాకర్ రావు, యూనియన్ ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు. అలాగే శ్రీరామ స్పిన్నింగ్ మిల్ యూనియన్ కార్యదర్శి నర్సింగ్ రావు, యాదగిరి, నిత్యానంద్, కావేరి, నాగరాణి, సంపూర్ణ, లక్ష్మి, తస్లీం బేగం, ప్రమీల, బాలమణి, సమీనా, సత్యకుమారి, నర్సమ్మ, మల్లమ్మ తదితరులు హాజరయ్యారు.

# బాలు నాయక్ కు పితృ వియోగం

## బీఆర్ఎస్ శ్రేణుల పరామర్శ. బీఆర్ఎస్ మండల సమన్వయ సభ్యులు పసునూరి నవీన్ కుమార్.

**పాలకుర్తి, మే 30 జనం వాయిస్:**

జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర (పెద్ద తండా) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల సమన్వయ సభ్యులు జరుపుల బాలు నాయక్ తండ్రి జరుపుల మంగ్యా నాయక్ వయోభారంతో శనివారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పసునూరి నవీన్ పెద్ద తండాకు చేరుకుని మంగ్యా నాయక్ పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు,గుడికుంట తండా సర్పంచ్ మహేందర్ నాయక్,బీఆర్ఎస్ మండల సమన్వయ సభ్యులు జోగు గోపి,మాచర్ల ఎల్లయ్య,పెద్ద తండా బీ సర్పంచ్ తిరుపతి నాయక్,మాజీ రైతు కోఆర్డినేటర్ ధార శంకరయ్య,ఎఫ్ఎస్-సీ డైరెక్టర్ దండేబోయిన నాగమల్లు, పార్టీ నాయకులు వెంకట్ నాయక్,లకావత్ సురేష్ నాయక్,దండు చంద్రయ్య,కోలా నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# జూన్ 2న మంత్రి పొన్నంను కలుస్తామన్న తెలంగాణ ఉద్యమకారులు.

## ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలి రావాలన్న మాజీ జెడ్పిటిసి అందే స్వామి.

**జనం వాయిస్, చిగురు మామిడి మే.30:**

చిగురుమామిడి:జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించిన అనంతరం రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలవనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు,చిగురుమామిడి మాజీ జెడ్పిటిసి అందే స్వామి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న అన్ని రంగాల వారిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని అందే స్వామి కోరారు. జూన్ 2న హుస్నాబాద్ కు తెలంగాణ ఉద్యమకారులు మండలం నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేయనున్నట్లు అందే స్వామి తెలిపారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వినయ్ రావు



**పాలకుర్తి. మే 30 జనం వాయిస్:**

పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఎడవల్లి (పాకాల) ఎల్లయ్య ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎర్రబెల్లి వినయ్ రావు పరమర్శించి. 5 వేలు ఆర్థిక సహాయం అందించగా. శనివారం స్థానిక సర్పంచ్ కమ్మగాని విజయ- నాగన్న. ఉపసర్పంచ్ గాదపాక కిరణ్ మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెలమ కంటి స్వప్న- సతీష్. మామిండ్ల కవిత- శోభన్ బాబు. ఎడవెల్లి సోము. ఎడవల్లి (టైలర్) యాకయ్య. తదితరులు పాల్గొన్నారు.

# గార్లలో మూడు జిల్లాల స్థాయిలో బాస్కెట్ బాల్ పోటీలు.

## బాస్కెట్ బాల్ పోటీలను ప్రారంభించిన డిఎస్పి తిరుపతిరావు.


**జనం వాయిస్ -గార్ల-మే 30:**

స్థానిక పట్టణ కేంద్రం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట గల బాస్కెట్బాల్ క్రీడా మైదానంలో సమ్మర్ క్రీడల ముగింపును పురస్కరించుకుని ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం మూడు జిల్లాల బాస్కెట్బాల్ పోటీలను మహబూబాబాద్ డివిజన్ డీఎస్పీ తిరుపతిరావు శనివారం సాయంత్రం ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు క్రీడలలో పాల్గొనుట ముఖ్యమని, గెలుపొందుట కాదని తెలిపారు. చదువుతోపాటు విద్యార్థులు క్రీడలలో రాణించాలని ఆయన హితవు పలికారు. నిరంతర తెరఫీ ద్వారా క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవోభవ.. పెద్దలను గౌరవించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వారి గురువు రవీందర్ ను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గార్ల బయ్యారం సిఐ రవీందర్ యాదవ్, గార్ల ఎస్సై, బి సాయికుమార్, గార్ల మండలం బాస్కెట్బాల్ ఫౌండర్ రామన్న గౌడ్, గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హాతిరాం నాయక్, జిల్లా క్రీడల విభాగం బాధ్యులు జ్యోతి, పాఠశాల హెచ్ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు సూత్రపు జయశంకర్, రెఫరీలు మూడు జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.



# జూన్ 1 నుంచి మారనున్న యూపీఐ, ఏటీఎం నిబంధనలు..

జూన్ నెల ప్రారంభం కానుండటంతో దేశవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా యూపీఐ మరియు ఏటీఎం సేవలకు సంబంధించిన కొత్త నిబంధనలు వినియోగదారులపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. డిజిటల్ చెల్లింపులు, నగదు ఉపసంహరణలు చేసే వారు ఈ మార్పులపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. యూపీఐ లావాదేవీల్లో పారదర్శకత పెంచే లక్ష్యంతో కొత్త విధానం అమల్లోకి రానుంది. ఇకపై యూపీఐ ద్వారా డబ్బులు పంపే సమయంలో లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో నమోదైన అసలు పేరు స్పష్టంగా కనిపించనుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా, మొబైల్ నంబర్ ద్వారా చెల్లింపు చేసినా బ్యాంకు రికార్డుల్లో ఉన్న పేరునే వినియోగదారులు చూడగలుగుతారు. ఈ మార్పుతో తప్పు ఖాతాలకు డబ్బులు పంపే ప్రమాదం తగ్గడంతో పాటు మోసాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. మరోవైపు ఏటీఎం సేవల్లో కూడా కొన్ని మార్పులు అమల్లోకి రానున్నాయి. పలు బ్యాంకులు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో ఉచిత లావాదేవీల పరిమితిని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. నగదు ఉపసంహరణ, బ్యాలెన్స్ పరిశీలన, మినీ స్టేట్‌మెంట్ వంటి సేవలపై అదనపు చార్జీలు విధించే అవకాశం ఉంది. ముఖ్యంగా తరచూ ఇతర బ్యాంకుల ఏటీఎంలను వినియోగించే ఖాతాదారులు ఈ మార్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలను సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కొత్త నిబంధనలను ముందుగానే తెలుసుకుని అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని బ్యాంకింగ్ నిపుణులు పేర్కొంటున్నారు.




# జూన్‌లో బ్యాంకులకు వరుస సెలవులు.. ముందుగానే ప్లాన్ చేసుకోండి..!

జూన్ నెలలో బ్యాంకు ఖాతాదారులు తమ ఆర్థిక లావాదేవీలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాల్సిన అవసరం ఉంది. భారతీయ రిజర్వు బ్యాంకు విడుదల చేసిన సెలవుల జాబితా ప్రకారం వారాంతపు సెలవులతో పాటు పలు ప్రాంతీయ పండుగల సందర్భంగా బ్యాంకులు మూసివేయబడనున్నాయి. జూన్ 15న వైఎంఏ డే సందర్భంగా మిజోరాంలో, రాజా సంక్రాంతి పండుగ కారణంగా ఒడిశాలో బ్యాంకులు పనిచేయవు. జూన్ 25న మొహర్రం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకులకు సెలవు ఉంటుంది. జూన్ 26న మొహర్రం సందర్భంగా తెలంగాణ, ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో బ్యాంకు సేవలు నిలిచిపోతాయి. జూన్ 29న సంత్ గురు కబీర్ జయంతి కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో బ్యాంకులు మూసి ఉంటాయి. జూన్ 30న రెమ్నా ని పండుగ సందర్భంగా మిజోరాంలో ప్రాంతీయ సెలవు అమలులో ఉంటుంది. ఇవే కాకుండా దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం అయిన జూన్ 7, 14, 21, 28 తేదీల్లో బ్యాంకులు పనిచేయవు. అలాగే రెండో శనివారం జూన్ 13, నాలుగో శనివారం జూన్ 27న కూడా బ్యాంకు శాఖలు మూసి ఉంటాయి. అయితే బ్యాంకు శాఖలకు సెలవులు ఉన్నప్పటికీ ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎంలు, యూపీఐ సేవలు యథావిధిగా అందుబాటులో ఉంటాయి. గూగుల్ పే, ఫోన్‌పే, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ సేవలను వినియోగదారులు ఎలాంటి అంతరాయం లేకుండా ఉపయోగించుకోవచ్చు. నగదు డిపాజిట్లు, చెక్కుల క్లియరెన్స్, డిమాండ్ డ్రాఫ్టులు లేదా ఇతర శాఖాపరమైన పనులు ఉన్నవారు సెలవుల జాబితాను ముందుగానే పరిశీలించి తమ పనులను పూర్తి చేసుకోవాలని బ్యాంకింగ్ నిపుణులు సూచిస్తున్నారు.




# స్పైస్‌జెట్‌కు రూ.124 కోట్ల పన్ను నోటీసు.

ప్రముఖ తక్కువ ఖర్చు విమానయాన సంస్థ స్పైస్‌జెట్ మరోసారి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. జీఎస్టీ రిటర్నులు వరుసగా దాఖలు చేయకపోవడంతో వస్తు సేవల పన్ను శాఖ సంస్థకు రూ.124.65 కోట్ల పన్ను డిమాండ్ నోటీసు జారీ చేసింది. అంతేకాకుండా సంస్థ జీఎస్టీ నమోదు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం నిర్దేశిత గడువులో రిటర్నులు సమర్పించకపోవడంతో సంబంధిత నిబంధనల ప్రకారం తాత్కాలిక అంచనా ప్రక్రియ చేపట్టి బకాయిలను ఖరారు చేశారు. వివిధ నెలలకు సంబంధించిన పన్ను బకాయిలను కలిపి మొత్తం రూ.124.65 కోట్ల డిమాండ్‌ను నిర్ణయించినట్లు తెలుస్తోంది. జీఎస్టీ నమోదు రద్దుకు సంబంధించి ఇప్పటికే నోటీసు జారీ చేసినప్పటికీ సంస్థ నుంచి ఇంకా పూర్తి స్థాయి సమాధానం అందలేదని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న రిటర్నులను వెంటనే దాఖలు చేసి నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే స్పైస్‌జెట్ ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. గత త్రైమాసికంలో కూడా సంస్థ భారీ నష్టాలను నమోదు చేసినట్లు వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావం సంస్థ షేర్లపై కూడా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. పన్ను శాఖ తాజా చర్యలతో స్పైస్‌జెట్ భవిష్యత్ కార్యాచరణపై విమానయాన రంగంలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం సంస్థ ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందనేది కీలకంగా మారింది.




# భారీగా తగ్గిన బంగారం ధరలు

దేశవ్యాప్తంగా బంగారం కొనుగోళ్లలో మందగమనం కనిపిస్తున్న నేపథ్యంలో పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. బంగారానికి డిమాండ్ గణనీయంగా తగ్గడంతో పాటు విక్రయాలు కూడా భారీగా పడిపోయినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రభావంతో శనివారం బంగారం ధరల్లో గణనీయమైన తగ్గుదల నమోదైంది. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,640గా ఉండగా, శనివారం అది రూ.600 తగ్గి రూ.1,57,040కు చేరింది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.550 తగ్గి రూ.1,43,950గా నమోదైంది. 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.450 తగ్గి రూ.1,17,780 వద్ద కొనసాగుతోంది. ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరులో రూ.1,57,040గా ఉంది. ఢిల్లీలో రూ.1,57,190గా ఉండగా, చెన్నై, మధురై, కోయంబత్తూరులో రూ.1,59,600గా నమోదైంది. బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ అంతర్జాతీయ పరిస్థితులు, పెట్టుబడి ధోరణులు, డిమాండ్ ఆధారంగా ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. కొనుగోలు చేసే ముందు తాజా ధరలను ఒకసారి పరిశీలించాలని సూచిస్తున్నారు.






# ఆసియా క్రీడల్లో వైభవ్‌కు ఛాన్స్.. సూర్య, గిల్‌కు షాక్..!

జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడల కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి 30 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాథమిక జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాలో ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కడం విశేషం. అయితే భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వన్డే జట్టు సారథి శుభ్‌మన్ గిల్ పేర్లు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లోని ఐచీ-నగోయా వేదికగా ఆసియా క్రీడలు జరగనున్నాయి. ఇదే సమయంలో భారత్ స్వదేశంలో వెస్టిండీస్‌తో వన్డే, టీ20 సిరీస్ ఆడనుంది. రెండు కీలక టోర్నీలు ఒకేసారి జరుగుతుండటంతో బీసీసీఐ రెండు వేర్వేరు జట్లను సిద్ధం చేయాలని నిర్ణయించింది. ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శనతో వెలుగులోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీకి ఈ టోర్నీ ద్వారా అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించింది. యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనతోనే అతడిని ప్రాబబుల్స్ జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. సూర్యకుమార్ యాదవ్‌ను ఎంపిక చేయకపోవడానికి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ ప్రధాన కారణంగా తెలుస్తోంది. 2028 ఒలింపిక్స్, రాబోయే టీ20 ప్రపంచకప్‌లను దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లను తీర్చిదిద్దే దిశగా సెలక్టర్లు అడుగులు వేస్తున్నారు. మరోవైపు వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహించే అవకాశముండటంతో అతడిని ఆసియా క్రీడల జట్టుకు పరిగణలోకి తీసుకోలేదు. జట్టుకు కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. శ్రేయస్ అయ్యర్, సంజు శాంసన్, తిలక్ వర్మ పేర్లు సారథ్య రేసులో వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఒకరికి జట్టు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని సమాచారం. ప్రాథమిక జాబితాలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పేరు ఉన్నప్పటికీ అతడు తుది జట్టులో ఉంటాడా లేదా అనేది ఇంకా ఖరారు కాలేదు. అలాగే స్పిన్ విభాగంలో కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, హర్ష్ దూబే మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లకు మాత్రమే అవకాశం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన 30 మంది ఆటగాళ్లలో వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, సంజు శాంసన్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, రింకు సింగ్, తిలక్ వర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిద్ధ్ కృష్ణ, వరుణ్ చక్రవర్తి, అనుకుల్ రాయ్, ఆయుష్ బదోని, హర్ష్ దూబే, ధ్రువ్ జురెల్, ఖలీల్ అహ్మద్, రుతురాజ్ గైక్వాడ్, రవి బిష్ణోయ్, షాబాజ్ అహ్మద్, శివమ్ దూబే, విప్రాజ్ నిగమ్, హర్షిత్ రాణా, యశ్ ఠాకూర్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు. భారత జట్టు మరోసారి ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుండగా, యువ ఆటగాళ్ల ప్రదర్శనపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.





# వైభవ్ బ్యాటింగ్ అసాధారణం.. సీనియర్లకూ సాధ్యం కాదు: సర్ఫరాజ్ ఖాన్

రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై భారత బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. చిన్న వయసులోనే వైభవ్ ప్రదర్శిస్తున్న ఆత్మవిశ్వాసం, భారీ షాట్లు ఆడే సామర్థ్యం అసాధారణమని కొనియాడాడు. వైభవ్ హిట్టింగ్ పవర్ గురించి మాట్లాడుతూ, ఎంతో అనుభవం ఉన్న సీనియర్ క్రికెటర్లు కూడా బంతిని అతడు కొట్టినంత సమర్థంగా బాదలేరని సర్ఫరాజ్ పేర్కొన్నాడు. క్రీజులో నిలబడి బంతిని టైమ్ చేసే తీరు, సరైన షాట్ల ఎంపిక అతడి ప్రత్యేకత అని అన్నాడు. అంత చిన్న వయసులోనే ఇంతటి పరిణతి ప్రదర్శించడం సాధారణ విషయం కాదని సర్ఫరాజ్ అభిప్రాయపడ్డాడు. ప్రతి మ్యాచ్‌లోనూ భయం లేకుండా దూకుడుగా ఆడుతూ జట్టుకు కీలక పరుగులు అందిస్తున్నాడని తెలిపాడు. ఐపీఎల్ వేలంలో భారీ ధరకు ఎంపికైనప్పటి నుంచే వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ప్రస్తుతం అతని ప్రదర్శనలు రాజస్థాన్ రాయల్స్‌కు కీలక బలంగా మారాయి. సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్రముఖ ఆటగాడి నుంచి వచ్చిన ప్రశంసలు యువ బ్యాటర్‌కు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. భారత క్రికెట్‌కు వైభవ్ సూర్యవంశీ భవిష్యత్తులో కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశాలు ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులు సృష్టించే సామర్థ్యం అతనిలో కనిపిస్తోందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆసియా క్రీడల ట్రయల్స్‌లో అదరగొట్టిన వినేశ్.. తొలి బౌట్‌లో ఘన విజయం..!

ఆసియా క్రీడల కోసం నిర్వహిస్తున్న ఎంపికల ట్రయల్స్‌లో ప్రముఖ రెజ్లర్ వినేశ్ పోగట్ శుభారంభం చేసింది. ప్రారంభ బౌట్‌లో జ్యోతిపై 7-1 స్కోరు తేడాతో విజయం సాధించి తన సత్తా చాటింది. మ్యాచ్ ఆరంభంలో కొంత జాగ్రత్తగా ఆడిన వినేశ్, ఆ తర్వాత దూకుడు పెంచి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మొదటి పీరియడ్‌లో పుష్ పాయింట్‌తో ఖాతా తెరిచిన వినేశ్, అనంతరం డబుల్ లెగ్ అటాక్‌తో మరిన్ని పాయింట్లు సాధించింది. ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా రక్షణాత్మకంగానూ, దూకుడుగానూ ఆడి ఆధిక్యంలో నిలిచింది. రెండో పీరియడ్‌లో వినేశ్ పూర్తిగా మ్యాచ్‌ను తన నియంత్రణలోకి తీసుకుంది. రైట్ లెగ్ అటాక్‌లతో వరుస పాయింట్లు సాధిస్తూ 3-0 ఆధిక్యం సంపాదించింది. జ్యోతి కూడా లెగ్ అటాక్‌కు ప్రయత్నించినప్పటికీ, ఆ పోరులో వినేశ్ పైచేయి సాధించింది. కౌంటర్ అటాక్‌లో వరుసగా రెండు వేగవంతమైన కదలికలతో స్కోరును 7-0కు చేర్చింది. చివర్లో జ్యోతి ఒక పుష్ ఔట్ పాయింట్ సాధించినప్పటికీ ఫలితాన్ని మార్చలేకపోయింది. ఈ విజయంతో వినేశ్ పోగట్ తదుపరి బౌట్‌లో నిషాతో



తలపడనుంది. ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశంపై గతంలో వివాదం నెలకొన్నప్పటికీ, న్యాయపరమైన పోరాటం అనంతరం అవకాశం దక్కించుకున్న వినేశ్ ఇప్పుడు తన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆసియా క్రీడల బెర్త్ కోసం ఆమె పోరాటం ఆసక్తికరంగా మారింది.



# అందంతో ఆకట్టుకుంటున్న జియా శంకర్

టెలివిజన్, సినిమాలు, వెబ్ సిరీస్‌లలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న నటి జియా శంకర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. అందం, ఫ్యాషన్ అభిరుచి, సహజమైన నటనతో ఆమెకు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. తెలుగు చిత్రంతో తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించిన జియా శంకర్, ఆ తర్వాత తమిళం, మరాఠీ భాషల చిత్రాల్లోనూ నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వివిధ భాషల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ నటిగా తన ప్రతిభను చాటుకున్నారు. హిందీ టెలివిజన్ రంగంలో కూడా ఆమె విజయవంతమైన ప్రస్థానం కొనసాగింది. పలు ప్రముఖ ధారావాహికల్లో నటించి ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. తన సహజ నటనతో చిన్న తెరపై ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. ప్రముఖ వినోద కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆమెకు దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించింది. ఆ కార్యక్రమంలో ఆమె ప్రవర్తన, నిజాయితీ, ఆత్మవిశ్వాసం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. నటనతో పాటు జియా శంకర్ ఫ్యాషన్ ప్రపంచంలో కూడా ప్రత్యేక స్థానం సంపాదించారు. సంప్రదాయ దుస్తులు, ఆధునిక వస్త్రధారణ రెండింటిలోనూ ఆమె తనదైన శైలిని ప్రదర్శిస్తూ అభిమానులను ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా చీరలు, లెహంగాల్లో ఆమె కనిపించే తీరు సామాజిక మాధ్యమాల్లో తరచూ చర్చనీయాంశంగా మారుతోంది. సంప్రదాయం, ఆధునికత కలయికతో కూడిన ఆమె శైలి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

# మూడే సినిమాలు.. క్రేజ్ మాత్రం తగ్గలేదు..!

సినీ పరిశ్రమలో అందం, అభినయం ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అవకాశాలు దక్కని నటీమణులు చాలామంది ఉంటారు. అలాంటి వారిలో నటి ప్రియా ప్రకాష్ వారియర్ కూడా ఒకరు. తక్కువ సినిమాలే చేసినప్పటికీ భారీ అభిమాన గణాన్ని సొంతం చేసుకుని తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఒకే ఒక్క సన్నివేశంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ప్రియా ప్రకాష్ వారియర్, కన్నుకొట్టిన దృశ్యంతో సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారారు. ఆ వీడియోతో ఆమె పేరు ఒక్కసారిగా దేశవ్యాప్తంగా మార్మోగింది. తొలి చిత్రంతోనే యువతలో విపరీతమైన ఆదరణ సంపాదించారు. తర్వాత పలు భాషల్లో అవకాశాలు వచ్చినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కలేదు. తెలుగులో చేసిన చిత్రాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోవడంతో స్టార్ కథానాయికల జాబితాలో నిలవలేకపోయారు. అయినా కూడా ఆమెకు సామాజిక మాధ్యమాల్లో ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంటూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఆమె ఫ్యాషన్ శైలి, గ్లామర్ ఫొటోలు యువతను ఆకర్షిస్తున్నాయి. సినిమాల్లో విజయాలు ఆశించినంతగా రాకపోయినా, అభిమానుల్లో మాత్రం ప్రియా ప్రకాష్ వారియర్‌కు ప్రత్యేక స్థానం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం ఆమె పంచుకుంటున్న తాజా చిత్రాలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



# ఓటీటీలో ఈ వీకెండ్ వినోదాల జాతర

ఈ వారాంతం ఓటీటీ ప్రేక్షకులకు వినోదాల పండుగగా మారింది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీతో పాటు అంతర్జాతీయ భాషలకు చెందిన పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు ప్రముఖ డిజిటల్ వేదికల్లో అందుబాటులోకి వచ్చాయి. యాక్షన్, ప్రేమకథ, హాస్యం, ఉత్కంఠ, క్రీడా కథనాలు, డాక్యుమెంటరీలు ఇలా అన్ని రకాల వినోదాలను ప్రేక్షకులు ఆస్వాదించేందుకు అవకాశం లభిస్తోంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'లీడర్', 'భీమసేరి', 'పైసావాలా', 'నవాబ్స్ కేఫ్', 'సుఖమనో సుఖమను', 'సీట్ ఎడ్జ్' చిత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అలాగే 'స్పైడర్ నోయిర్' వెబ్ సిరీస్‌తో పాటు పలు అంతర్జాతీయ చిత్రాలు కూడా ప్రేక్షకులను అలరించనున్నాయి. నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ నటించిన 'కర' చిత్రం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. అలాగే పలు అంతర్జాతీయ చిత్రాలు, వెబ్ సిరీస్‌లు, క్రీడా డాక్యుమెంటరీలు కూడా స్ట్రీమింగ్‌కు వచ్చాయి. జియోహాట్‌స్టార్‌లో 'జెట్ లీ', 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్', 'కజిన్స్ అండ్ కల్యాణమ్స్' వంటి చిత్రాలు, సిరీస్‌లు ప్రేక్షకులకు అందుబాటులో ఉన్నాయి. జీ5 వేదికపై తెలుగు చిత్రం 'డ్రింకర్ సాయి' విడుదల కాగా, ఈటీవీ విన్‌లో 'మేరీ ఆవాజ్ సునో' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సన్ నెక్స్ట్‌లో 'ఫేసెస్' చిత్రం, మనోరమ మాక్స్‌లో 'ఎస్పీఏ' చిత్రం స్ట్రీమింగ్ అవుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ వేదికలో 'ది మూమెంట్' కూడా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధంగా ఉంది. విభిన్న అభిరుచులు కలిగిన ప్రేక్షకులకు ఈ వీకెండ్‌లో ఎన్నో ఎంపికలు అందుబాటులో ఉండటంతో ఓటీటీ ప్రపంచం మరింత సందడిగా మారింది.



Printed, Published and Owned by GATTU MAHESH, Printed at M R PUBLICATIONS, # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A, VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. RNI NO: TGTEL/26/A0383, CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com